క్లుప్తంగా

కలెక్టర్ పర్యవేక్షణతో మార్పు వచ్చేనా?

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో శానిటేషన్ విధానంపై కలెక్టర్ విజయేందిర బోయి సీరియస్ అయిన విషయం విదితమే. ఇకపై ఆస్పత్రిలో శానిటేషన్ విభాగం చేసే క్లీనింగ్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి కలెక్టర్ వాట్సప్ గ్రూప్ ఏర్పాటుచేశారు. ఆస్పత్రిలో ఉన్న అన్నిరకాల వార్డులు, విభాగాలు, టాయిలెట్స్, ముఖద్వారం, పరిసర ప్రాంతాల్లో శుభ్రత పనుల ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ విధానం సోమవారం నుంచి పక్కాగా అమల్లోకి తీసుకువచ్చారు. కలెక్టర్ పర్యవేక్షణతో అయినా ఆస్పత్రిలో శానిటేషన్ గాడిలో పడుతుందో లేదో వేచి చూడాలి.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (టీఎస్‌హెచ్‌ఆర్‌సీ)లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మానవ హక్కుల కార్యకర్త ఎ.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా చైర్‌పర్సన్, సభ్యుల స్థానాలు కొన్నేళ్లుగా ఖాళీగా ఉండటంతో మానవ హక్కుల ఉల్లంఘన కేసులు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ఈ కమిషన్ పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో మానవ హక్కులను పరిరక్షించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. దీంతో పౌరులు సరైన న్యాయం, రక్షణ హక్కులు కోల్పోతున్నారని వాపోయారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

పీయూ వీసీని కలిసిన జేపీఎన్‌సీ చైర్మన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నూతన వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్‌ను సోమవారం జేపీఎన్‌సీ చైర్మన్ రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. జేపీఎన్‌సీకి న్యాక్, అటానమస్ గుర్తింపు విషయంలో వీసీ శ్రీనివాస్ ఎంతో సహకారం అందించారని తెలిపారు.

బీసీల ఐక్య సంఘం ఏర్పాటు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని బోయపల్లిలో సోమవారం కమ్మరి, వడ్ల, కుమ్మరి, చాకలి, మంగలి, ముదిరాజ్, యాదవ, గౌడ నాయకుల ఆధ్వర్యంలో 16వ వార్డు బీసీల ఐక్య సంఘాన్ని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా వాస సత్యం, ప్రధాన కార్యదర్శిగా జనసీల యాదగిరి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు, కోశాధికారిగా భగవాన్, న్యాయ సలహాదారుగా డి.వినోద్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.యాదయ్య, బాలరాజ్‌గౌడ్, రవికుమార్‌చారి, జుర్రు సత్తయ్య, సహ కార్యదర్శులుగా కుమ్మరి వెంకటయ్య, జనసీల విజయ్‌కుమార్, వీరాచారి, గోవర్ధన్‌ను ఎన్నుకున్నారు.

నిబద్ధతకు పట్టం



మహబూబ్‌నగర్ రూరల్: ఎన్‌ఎస్‌యూఐతో కాంగ్రెస్ పార్టీలో ప్రయాణం మొదలుపెట్టిన లక్ష్మణ్‌యాదవ్.. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పార్టీని వీడలేదని కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లక్ష్మణ్‌యాదవ్ నిబద్ధతే ముడా చైర్మన్ పదవి రావడానికి కారణమని అన్నారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి ముడా చైర్మన్ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 23న జిల్లా కేంద్రంలో జరిగే ముడా చైర్మన్ ప్రమాణ స్వీకారానికి యాదవులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అఖిలభారత యాదవ మహాసభ నాయకులు నర్సింహులు యాదవ్, రాజుయాదవ్, గంగపురి యాదవ్, చెన్నయ్యయాదవ్, రామకృష్ణ యాదవ్, కృష్ణయాదవ్ ఉన్నారు.

'జీహెచ్‌ఎంల సస్పెన్షన్ సరికాదు'

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో 10 మంది జీహెచ్‌ఎంలను సస్పెన్షన్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధన్మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్‌ఎంలు పాఠశాలలను పర్యవేక్షించడంతో పాటు ఉపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులకు వారధిగా ఉంటున్నారన్నారు. ఎంఈఓలుగా, ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జీహెచ్‌ఎం పోస్టు మల్టీజోనల్ పోస్టు అని, వారి స్పౌజ్‌లకు దగ్గరగా బదిలీ పెట్టుకున్నప్పటికీ.. అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారన్న నెపంతో వారిని సస్పెన్షన్ చేయడం తగదన్నారు. వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



కలెక్టరేట్‌లో ఫిర్యాదుదారుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/కోయిల్‌కొండ: ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎప్పటి సమస్యలను అప్పుడే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంపై ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, డీఆర్డీఓ నర్సింహులు పాల్గొన్నారు.

- కోయిల్‌కొండ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకొని ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి వారం నిర్వహించే ప్రజావాణికి మండల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజాగణేష్, ఎంపీడీఓ కాళప్ప, ఎంఈఓ వెంకటాజీ, సూపరిటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, ఏఎంఓ నజీర్ హైమద్, ఏఈఓలు పరుశురాం, సత్తయ్య పాల్గొన్నారు.

సెక్యూరిటీ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి..

సెక్యూరిటీ గార్డులకు అరకొర జీతాలు ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, విద్య, వైద్యసంస్థలు, పరిశ్రమలు, మాల్స్‌లలో సెక్యూరిటీ గార్డులతో 14 నుంచి 18 గంటలు పని చేయిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ కేవలం రూ. 5వేల నుంచి రూ. 6వేలు మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. సెలవుల విషయంలోనూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

వివిధ సమస్యలపై అర్జీలు..

గండేడ్/రాజాపూర్/చిన్నచింతకుంట/హన్వాడ: గండేడ్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై మూడు అర్జీలు వచ్చాయి. రాజాపూర్‌లో ఆరు ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. చిన్నచింతకుంటలో ఒక్క ఫిర్యాదు కూడా అందలేదు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి..



గ్రామపంచాయతీల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాల పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ హన్వాడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీఓ యశోదకు తాజా మాజీ సర్పంచులు వినతిపత్రం అందజేశారు. సర్పంచులపై ఒత్తిడి తీసుకురావడంతో సొంత డబ్బుతో క్రీడా ప్రాంగణాలను నిర్మించామని.. పదవీకాలం ముగిశాక రికవరీల పేరిట రూ. 30వేల నుంచి రూ. 40వేల వరకు బిల్లులను పెండింగ్‌లో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ సర్పంచులు వెంకన్న, చెన్నయ్య, రాఘవులు, అనంతరెడ్డి, యాదయ్య, అంజిలయ్య, శ్రీనివాసులు ఆవేదన వ్యక్తంచేశారు.

తాగునీటి కొరతతో అవస్థలు..



జిల్లా కేంద్రంలోని దివిటిపల్లి డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డబుల్‌బెడ్రూం ఇళ్ల అభివృద్ధి పోరాట ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి మోహన్ కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రోడ్డు మార్గమైన రైల్వే అండర్ పాస్‌లో వర్షం పడితే రాకపోకలకు కష్టంగా ఉంటుందన్నారు. కొత్తగా వేసిన బోరుమోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని హన్మంతు, చంద్రశేఖర్, ప్రకాష్, వెంకటేష్ కోరారు.

కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి : ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

మహమ్మదాబాద్: కేసుల దర్యాప్తులో వేగం పెంచి, నేరస్తులకు న్యాయస్థానంలో శిక్షలు ఖరారయ్యేలా చూడాలని ఎస్పీ జానకి అన్నారు. సోమవారం మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించడంతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాల్లో గస్తీ పెంచి, చోరీలకు అడ్డుకట్ట వేయాలని సిబ్బందికి సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్పీ వెంట ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి ఉన్నారు.

చేపపిల్లల సంఖ్య తగ్గడం తగదు



కొకుంట్ల చెరువులో చేపపిల్లలను వదులుతున్న నాయకులు

జడ్చర్ల: చెరువులు, కుంటల్లో చేపపిల్లలను వదిలి మత్స్యకారులను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం.. అకస్మాత్తుగా చేపపిల్లల సరఫరాను తగ్గించి, కోత విధించడం తగదని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది సరఫరా చేసిన చేపపిల్లల సంఖ్యను ఈ ఏడాది సగానికి తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కారణంగా చేపలపై ఆధారపడి ఉపాధి పొందే మత్స్యకారులు నష్టపోతారని తెలిపారు. అంతేగాక ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటుందని, మరోసారి పునరాలోచించి గతేడాది మాదిరిగానే చేప పిల్లలను సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి..

దేవరకద్ర రూరల్: ప్రభుత్వ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు అన్నారు. మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొకుంట్ల అమ్మల్ చెరువు, తుమ్మల చెరువు, పెద్ద చెరువుల్లో చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, శేఖర్, ఆశన్న, దేవేందర్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన



క్షేత్రస్థాయిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

దేవరకద్ర: మండల కేంద్రంలో ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను సోమవారం సంబంధిత అధికారులు పరిశీలించారు. దరఖాస్తుదారుల ప్లాట్లను సందర్శించి, పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా తమ ప్లాట్ల వివరాలను తెలియజేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని ఈఓ సీత్యానాయక్ కోరారు.

ఉద్యమకారుల డిమాండ్లు నెరవేర్చాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా నుంచి ఓయూ ఆర్ట్స్ కాలేజీ వరకు చేపట్టిన పాదయాత్ర సోమవారం జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల పాదయాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం ఉద్యమకారులకు సరైన గుర్తింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రజక రిజర్వేషన్ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శివన్న, బాల్‌చందర్ పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



నవాబుపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నవాబుపేట: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ అనంతరం పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విక్రమ్, మాజీ సర్పంచులు గోపాల్‌గౌడ్, చంద్రశేఖర్, ఫోరం నాయకులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప, పురుషోత్తం, కోట్లరాజు, రామకృష్ణ, లతీఫ్, శ్రీనివాస్, ఆనంద్, నరేష్, తిరుపతయ్య పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను స్మరించుకోవాలి..

పాలమూరు: శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు సమాజం ఎప్పటికీ మరవదని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ చౌరస్తాలో పరదేశీనాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణరావు, రాజసింహుడు, సురేష్‌బాబు, నాగభూషణం, రాములు, హన్మంతురెడ్డి, అహ్మద్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయం వద్ద సోమవారం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ బీసు నర్సింహారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటయ్య, పూజారి నాగరాజు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

రాజాపూర్: మండలంలోని రాయపల్లి శివారు వాగులోకి వెళ్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రవి వివరాల మేరకు.. సోమవారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలించేందుకు టిప్పర్ వాగులోకి వెళ్తుండగా.. పెట్రోలింగ్ పోలీసులు పట్టుకొని డ్రైవర్ గొడుగు శ్రీకాంత్‌ను ప్రశ్నించారు. ఇసుక తరలింపునకు సంబంధించి అతడి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడు అదృశ్యం

హన్వాడ: మండలంలోని చిన్నదర్పల్లి పూజారితండాకు చెందిన కేతావత్ శివశంకర్ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న శివశంకర్ ఈ నెల 10న హైదరాబాద్‌కు కిరాయి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శివశంకర్ తల్లి శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేసు నమోదు

మిడ్జిల్: మండల కేంద్రంలో ఓపెన్ ప్లాట్లను వ్యవసాయ భూమిగా మార్చి ఇతరులకు విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. సర్వేనంబర్ 207, 219లో ఉన్న భూమిని సదరు యజమాని ఇర్ఫాన్ బిన్ హుస్సేన్ ఓపెన్ ప్లాట్లుగా మార్చి కొందరికి రిజిస్ట్రేషన్ చేశాడు. మళ్లీ ఆ భూమిని వ్యవసాయ భూమిగా మార్చి ఇటీవల చాకలి శ్రీశైలం, దంతమోని పాండుకు విక్రయించాడు. దీనిపై సోమవారం తహసీల్దార్ రాజు ఫిర్యాదు మేరకు ఇర్ఫాన్ బిన్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

దేవరకద్ర రూరల్: కొకుంట్లకు చెందిన సొంగని చెన్నయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 21వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా గద్దెగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ ఆంజనేయులును జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్ పరామర్శించి, వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

కోయిల్‌కొండ: మండలంలోని పారుపల్లికి చెందిన గర్భిణి అనితకు సోమవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది గర్భిణిని జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. కుటుంబ సభ్యుల సహకారంతో ఈఎంటీ రవిప్రకాష్, అంజిలయ్య సాధారణ కాన్పు చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని.. వారిని జిల్లా ఆస్పత్రిలో చేర్పించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి

మిడ్జిల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. మండలంలోని మల్లాపూర్‌లో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంగారయ్య, అల్వాల్‌రెడ్డి, గౌస్, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, సీసీ యాదమ్మ, జంగారెడ్డి, అయ్యన్న, రాంచంద్రారెడ్డి, సుకుమార్, బంగారయ్య పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సర్టిఫికెట్లు పొందిన మహిళలతో భీమకవి వసంత

స్టేషన్ మహబూబ్‌నగర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికాభివృద్ధి సాధించాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు భీమకవి వసంత అన్నారు. మహిళా సాధికారతలో భాగంగా జిల్లా కేంద్రంలోని నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక శేషాద్రినగర్‌కు చెందిన 30 మంది మహిళలకు మూడు నెలలపాటు ఎంబ్రాయిడరీ, టైలరింగ్ శిక్షణ అందజేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సోమవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని కోరారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి అనేక పథకాలను అమలుచేస్తున్నారని అన్నారు. త్వరలోనే ప్రభుత్వం మహిళల పేరిట ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ్ సంస్థ కోఆర్డినేటర్ సుభాషిణి, ట్రైనర్ సువేరాబేగం పాల్గొన్నారు.

కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కోయిల్‌కొండ: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పంచాయతీ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎదిరింటి నర్సింహులు కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంపీడీఓ కాళప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు జీతాలు పెంచాలని.. మల్టీపర్పస్ విధానం రద్దుచేసి జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనునాయక్, కార్యదర్శి వెంకటయ్య, అజ్జుపాషా, గోపాల్, కొండన్న, కురుమూర్తి, కేశవులు పాల్గొన్నారు.

ముందుజాగ్రత్తలతోనే టీబీ నియంత్రణ



టీబీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మహమ్మదాబాద్: ప్రజలు టీబీ బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి రహమత్ సూచించారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. వ్యాధి ప్రారంభ దశలో ఉన్నప్పుడే గుర్తించి, చికిత్స పొందితే త్వరగా నయం అవుతుందన్నారు. అనంతరం శిబిరానికి హాజరైన వారికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు పద్మ, అంబదాసు, మహమ్మద్ మన్సూర్‌అలీ, పద్మ, ఏఎన్‌ఎంలు డి.కవిత, బాల్‌రాజ్, సత్యనారాయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.


27వ వార్డులో మౌలిక వసతులు కల్పించాలి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని 27వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ అధికారి మంజులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 27వ వార్డు పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో 15 రోజులకోసారి తాగునీరు వస్తున్నాయన్నారు. తాగునీటి సమస్యపై వాటర్‌మన్‌ను ప్రశ్నిస్తే, ఏవేవో కారణాలు చెబుతున్నారని వివరించారు. వార్డులో 15ఏళ్ల క్రితం వేసిన సీసీరోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని.. కొత్తరోడ్లు నిర్మించాలని కోరారు. మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడంతో పాటు అన్ని కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గంగారాం, భీంరాజ్, మేఘమాల, రవికుమార్, చెన్నయ్య, జాని, రవికుమార్ పాల్గొన్నారు.

3వ వార్డులో విద్యుత్ సమస్య..

పట్టణంలోని 3వ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యలపై వినియోగదారుల ఫోరం చైర్మన్ నాగేశ్వర్‌రావుకు వార్డు కౌన్సిలర్ సతీష్ ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని ఫోరం కార్యాలయంలో చైర్మన్ కలిసి, 3వ వార్డులో నెలకొన్న సమస్యలను వివరించారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

- పరుశవేదీశ్వరస్వామి ఆలయంలో ముగిసిన అగ్నిగుండ మహోత్సవాలు

జడ్చర్ల టౌన్: మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న అగ్నిగుండ మహోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అగ్నిగుండంలో భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండంలో నడిచేందుకు కొందరు భక్తులు పోటీపడ్డారు. భక్తుల ఓం నమఃశివాయ నామస్మరణల మధ్య అగ్నిగుండ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి.. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన కళాకారుల నృత్యాలు, విన్యాసాలు భక్తులను అలరించాయి. ఓ భక్తుడు కిలోమీటరు తాడును ఓవైపు నుంచి మరో వైపు తీసి భక్తులను ఆశ్చర్యపరిచారు.

దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన



నందిగామలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

రాజాపూర్: మండలంలోని నందిగామలో సోమవారం బొడ్రాయి, పోచమ్మ, నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, ప్రత్యేక పూజలు చేశారు. దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్, పెంటయ్య, రాఘవ, సత్యం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రిజ్ పేలి ఇల్లు దగ్ధం

నవాబుపేట: ఫ్రిజ్ పేలి ఇల్లు దగ్ధమైన ఘటన నవాబుపేట మండలం చాకలిపల్లిలోచోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చాకలిపల్లికి చెందిన చెంచు చెన్నయ్య ఈ నెల 3వ తేదీన రూ.15,600 వెచ్చించి కొత్త ఫ్రిజ్ కొనుగోలు చేశారు. అది ఉన్నట్టుండి సోమవారం ఒక్కసారిగా పేలింది. దీంతో ఇంట్లోని వస్తువులకు మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయాయి. ఫ్రిజ్ పేలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవటంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు.